వయోజన విద్య డీడీగా అనిల్ బాధ్యతల స్వీకరణ

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 6: వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా అనిల్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం జడ్పీసెంటర్‌లోని వయోజన విద్య కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి డీడీగా చేసి ఉద్యోగ విరమణ పొందిన జయశంకర్ నుంచి చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

వాసవి టెంపుల్ చైర్మన్‌గా 'మేళ్ల చెరువు'

మేళ్లచెరువుకు నియామక పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి శ్రీరాములు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 6: నగరంలోని త్రీటౌన్ ప్రాంతంలో ఉన్న అత్యంత ప్రసిద్ధ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ చైర్మన్‌గా మరోసారి మేళ్లచెరువు వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. చైర్మన్ పదవికి ఒకటే నామినేషన్ దాఖలు కావడంతో ఎన్నికల అధికారి పీబీ శ్రీరాములు మేళ్లచెరువును చైర్మన్‌గా ప్రకటిస్తూ నియామక పత్రం అందజేశారు. ప్రస్తుతం నగరంలోని వర్తక సంఘం గౌరవ అధ్యక్షుడిగా కొనసాగుతున్న మేళ్లచెరువు.. 2012 నుంచి వరుసగా వాసవి టెంపుల్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మరో మూడేళ్లపాటు ఆయన చైర్మన్‌గా కొనసాగనున్నారు. మరోసారి వాసవి టెంపుల్ చైర్మన్‌గా వెంకటేశ్వరరావు ఎంపిక కావడం పట్ల వర్తక సంఘం వ్యాపారులు, ఆర్యవైశ్యులు, అయ్యప్ప స్వామి దేవాలయం పాలక మండలి సభ్యులు అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మైనార్టీ అభ్యర్థులకు ఉచిత 'గ్రూప్స్' బేసిక్ శిక్షణ

మామిళ్లగూడెం, జనవరి 6: జిల్లాలో ఉద్యోగ పోటీ పరీక్షలైన గ్రూప్-1, 2, 3, 4లకు సిద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులు బేసిక్ పౌండేషన్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి కస్తాల సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర మైనార్టీ స్టడీసర్కిల్, మైనార్టీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ఉద్యోగాల పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. అర్హత, ఆసక్తి ఉన్న మైనార్టీ అభ్యర్థులైన ముస్లిం, సిక్కులు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు సంబంధిత పత్రాలతో ఈ నెల 10లోగా జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 9704003002 నంబరును సంప్రదించాలన్నారు.

కరాటే పోటీల్లో ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థుల సత్తా

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 6: నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో ఖమ్మంలోని ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులు సత్తా చాటారు. హార్వెస్ట్ పాఠశాల విద్యార్థులు పలు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ప్రతిభ చాటి బంగారు పతకాలు సాధించారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి అభినందించారు. అలాగే, విన్‌ఫీల్డ్ పాఠశాల విద్యార్థులు వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. వీరిని పాఠశాల డైరెక్టర్లు మన్నె కిశోర్‌కుమార్, గద్దె పుల్లారావు, పోలవరపు శ్రీకాంత్ అభినందించారు. అలాగే, వికాస్ స్కూల్ విద్యార్థులు కరాటే చాంపియన్‌గా నిలిచారు. వీరిని ఆ స్కూల్ కరస్పాండెంట్ వై.లావణ్య, ఉపాధ్యాయులు అభినందించారు. అదేవిధంగా, సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఖమ్మంలోని ఎక్స్‌లెంట్ జూనియర్ కళాశాల విద్యార్థి అభిరామ్.. వెయిట్ లిఫ్టింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించాడు. ఇతడిని ఆ పాఠశాల కరస్పాండెంట్ చల్లా శేషగిరి ప్రశంసించారు.

కళావేదిక నిర్మాణానికి రూ.5లక్షల విరాళం

కళావేదిక నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దాత వెంకటేశ్వరరావు

మధిర, జనవరి 6: మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శాశ్వత కళావేదిక నిర్మాణానికి సీవీఆర్ చిట్స్ అధినేత చెరుకూరి వెంకటేశ్వరరావు రూ.5 లక్షలు అందజేశారు. దాత తల్లిదండ్రులు చెరుకూరి నర్సయ్య, సుబ్బలక్ష్మీ జ్ఞాపకార్థం చేపడుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. అదేవిధంగా హరిజనవాడ పాఠశాలలో విద్యార్థుల కోసం మంచినీటి సదుపాయం కోసం మినరల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దాతను పలువురు అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మధిర మున్సిపల్ వైస్ చైర్మన్ శీలం విద్యాలత, మొండితోక సుధాకర్, శీలం వెంకటరెడ్డి, సత్యనారాయణ, ముప్పా రామకృష్ణ, నీలం వెంకటేశ్వర్లు, హెచ్ఎం తోట నర్సింహారావు, ఉపాధ్యాయులు జ్ఞానేశ్వరచారి, బీ.కోటేశ్వరరావు, కే.ఆదాం, పీ.కిశోర్, ఏ.కృష్ణమూర్తి, టీ.జ్యోతిర్మయి, ఎస్.శ్రీదేవి, ఎస్.సంధ్యాలక్ష్మి, బీ.శర్మ, ఎం.సామేలు, ఎం.మాధవరావు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభం

కూసుమంచి (నేలకొండపల్లి) జనవరి 6: ఎన్‌జీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేలకొండపల్లిలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని సోమవారం డాక్టర్ జాస్తి సుబ్బారావు ప్రారంభించారు. అనంతరం మహిళలకు కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని ప్రాంభించారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి బండి రమేశ్, ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రంగారావు, ఐలమ్మ ట్రస్టు రాష్ట్ర అధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బండి పద్మ, రచ్చా నర్సిహారావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగస్తులకు బదిలీలు సహజం

కూసుమంచి (నేలకొండపల్లి), జనవరి 6: ప్రభుత్వ ఉద్యోగాల్లో బదిలీలు సహజమని, బదిలీ సమయంలో వారి పని తీరు గుర్తింపును తెస్తుందని వ్యవసాయశాఖ ఏడీఏ సరిత అన్నారు. నేలకొండపల్లిలోని వ్యవసాయశాఖలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఏడీఏ విజయ్‌చంద్ర, ఏవోలు నారాయణరావు, అరుణ కుమారిలను సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

మిరపను ఆశిస్తున్న నల్ల తామర పురుగులు

కొణిజర్ల, జనవరి 6: మిరపలో నల్లతామర పురుగులు ఆశించినట్లు గుర్తించామని మండల వ్యవసాయ అధికారి బాలాజీ తెలిపారు. సోమవారం మండలంలోని అంజనాపురంలో మిరప తోటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. నల్లతామర పురుగులు ప్రధానంగా ఆకుల మీద, పువ్వులో ఎక్కువ సంఖ్యలో చేరి రసం పీల్చడం వల్ల ఆకులు మాడిపోయినట్లుగా కనిపిస్తుందన్నారు. ఈ ఉనికిని తొలిదశలో సకాలంలో సరైన యజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు.

దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

కొణిజర్ల, జనవరి 6: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో భాగంగా ప్రజలు అందించే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణ అధికారి దీక్షారైనా సూచించారు. కొణిజర్లలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆమె హాజరై మండల స్థాయిలో వివిధ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా పురోగతిపై ఆరా తీసిన ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తఫజ్జుల్‌హుస్సేన్, ఎంపీడీవో రోజారాణి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

రూ.15 వేల రైతుభరోసా ఇవ్వాల్సిందే..

నేలకొండపల్లి ర్యాలీలో ఉన్నం బ్రహ్మయ్య, నాయకులు , పెనుబల్లి: తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నాయకులు, కల్లూరు సెంటర్‌లో..

- కాంగ్రెస్ ప్రభుత్వ మోసాన్ని సహించం
- ఎకరానికి రూ. 12వేలను ఒప్పకోం
- జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణుల నిరసన
- కదిలి వచ్చి ధర్నాల్లో పాల్గొన్న అన్నదాతలు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎకరానికి రూ.15 వేల చొప్పున రైతుభరోసా ఇవ్వాల్సిందేనని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు మాత్రమే ఇస్తూ రైతులకు ముష్టివేస్తోందంటూ విమర్శించిన రేవంత్‌రెడ్డి.. తాము అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.15 వేలు ఇస్తామంటూ ప్రగల్భాలు పలికారని హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. కానీ అధికారం చేపట్టిన ఏడాది తరువాత రైతుభరోసా కింద ఏటా ఎకరానికి రూ.12 వేలు మాత్రమే ఇస్తామంటూ మోసం చేశారంటూ మండిపడ్డారు. రూ.12 వేల చొప్పునే ఇస్తామంటే మాత్రం ఒప్పుకునేది లేదని స్పష్టం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.15 వేలు ఇవ్వాల్సిందేనంటూ డిమాండ్ చేశారు. అప్పటి వరకూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని తేల్చిచెప్పారు. రైతుభరోసాను రూ.12 వేల చొప్పునే ఇస్తామంటూ ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనను నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ తాతా మధు పిలుపు మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు కలిసి సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించారు. అన్ని మండలాల్లోనూ ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. కొన్ని మండలాల్లో రాస్తారోకోలో, నిరసన ర్యాలీలు చేపట్టారు. బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ.. రైతుభరోసాలో కోతలు తగవని అన్నారు. కాంగ్రెస్ ఢిల్లీ పెద్దల సాక్షిగా మాట ఇచ్చిన వరంగల్ డిక్లరేషన్‌ను అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు.

- నమస్తే నెట్‌వర్క్

వేంసూరు: నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, ముదిగొండ: వినతిపత్రం అందిస్తున్న నాయకులు, మధిర: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బోనకల్లు, మధిర తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, చర్ల: మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

హెల్మెట్ తప్పనిసరిగా వాడాలి

వాహనదారులకు గులాబీపువ్వు ఇచ్చి అవగాహన కల్పిస్తున్న ఏఎంవీఐ విజయశాంతి

పెనుబల్లి, జనవరి 6: వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ఏఎంవీఐ విజయశాంతి తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం కల్లూరు చెక్‌పోస్టు వద్ద హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకుండా వాహనాలు నడపుతున్న వారికి గులాబీ పువ్వు అందించి వినూత్నంగా అవగాహన కల్పించారు. వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్, సిగ్నల్స్‌పై అవగాహన కల్పించి, రోడ్డు భద్రత అందరి బాధ్యత అని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ సీహెచ్.వెంకటేశ్వరరావు, వీ.నిశ్చల, డీబీఏ సాహిల్, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన సండ్ర

క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మాజీఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి, జనవరి 6: బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు షేక్ హుస్సేన్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్లను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సోమవారం తల్లాడ రింగ్‌సెంటర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీర మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, నాయకులు దుగ్గిదేవర వెంకట్‌లాల్, దిరిశాల దాసురావు, బద్దం కోటిరెడ్డి, కోడూరి వీరకృష్ణ, మోదుగు ఆశీర్వాదం, జేవీఆర్.పోతురాజు, వెంకటయ్య, ఇనుపనూరి వినయ్‌కుమార్, అయిలూరి శివారెడ్డి, పాపులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు

పెనుబల్లి, జనవరి 6: అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని లంకపల్లి, కొత్తలంకపల్లి, మండాలపాడు గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు మాదాసు నాగేశ్వరి, మండల కార్యదర్శి మిట్టపల్లి నాగమణి పద్మప్రియ, రజిని, రమణమ్మ, సరస్వతి, కృష్ణవేణి, చింతల జ్యోతి పాల్గొన్నారు.

గంజాయిని సమూలంగా నియంత్రించాలి

వీసీలో నిర్వహించిన సమీక్షలో అడిషనల్ డీసీపీలు

మామిళ్లగూడెం, జనవరి 6: గంజాయి వంటి మాదకద్రవ్యాల సరఫరా, వినియోగాన్ని సమూలంగా నిర్మూలించడానికి క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలని అడిషనల్ డీసీపీలు నరేశ్‌కుమార్, ప్రసాదరావులు పోలీసు అధికారులను ఆదేశించారు. ఖమ్మం పోలీసు కమిషనరేట్ పరిధిలోని క్షేత్రస్థాయి పోలీసు అధికారులతో వీడియోకాన్ఫరెన్స్‌లో సోమవారం నిర్వహించిన సమీక్షలో వారు మాట్లాడారు. ముఖ్యంగా విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ కమిటీల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో ర్యాలీలు, సదస్సులు నిర్వహించి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని ఆదేశించారు. అలాగే కట్టుదిట్టమైన నిఘాతో మాదకద్రవ్యాల సరఫరా, వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, ప్రజలు కూడా సైబర్ నేరగాళ్ల భారిన పడ్డామని గుర్తించిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కుగానీ లేదా సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో నేరుగానీ ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ విషయం పట్ల ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని తెలిపారు. సెల్‌ఫోన్లకు వస్తున్న తప్పుడు మెసేజ్‌లు, లింక్‌లను, యాప్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా జాతీయ, రాష్ట్ర, గ్రామీణ రహదారుల్లో జరుగుతున్న ప్రమాదాలను విశ్లేషించి నివారణకు రోడ్డు భద్రతా కమిటీ పర్యవేక్షణలో అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు.

వాడిన ప్లాస్టిక్ వేస్ట్‌ను కంపోస్టుగా మార్చుకోవాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న అలుగు వర్షిణి

ఎర్రుపాలెం, జనవరి 6: వాడిన ప్లాస్టిక్ వేస్ట్‌ను కంపోస్టుగా మార్చుకోవాలని, ప్లాస్టిక్ ఫ్రీ వారం నిర్వహిస్తున్నామని సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సెక్రటరీ అలుగు వర్షిణి అన్నారు. సోమవారం స్థానిక గురుకుల పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 268 గురుకులాల విద్యాలయాలకు జీరో వేస్ట్‌పై పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రథమ బహుమతి వచ్చిన గురుకుల పాఠశాలకు రూ.5 లక్షలు బహుమతి, ద్వితీయ రూ.3 లక్షలు, తృతీయ రూ.2 లక్షలు ఇస్తామని తెలిపారు. 'నేను నా ఇల్లు ఎలా శుభ్రపర్చుకోవాలి' అనే అంశాన్ని విద్యార్థులకు తెలిసే విధంగా కళాశాలను శుభ్రపరిచే విధానాన్ని తెలిపారు. కార్యక్రమంలో గురుకుల విద్యాలయాల జోనల్ అధికారి కొప్పుల స్వరూపరాణి, ప్రిన్సిపాల్ చావా జ్యోతి, పేరెంట్స్ కమిటీ సభ్యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను రక్షించాలి

మధిర/మధిర రూరల్, జనవరి 6: ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న ఆక్రమణదారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములను రక్షణ కల్పించాలని సీపీఐ నాయకులు బెజవాడ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో తహసీల్దార్ రాంబాబును నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పట్టణంలో హిందూ శ్మశానవాటికకు సంబంధించిన 10 ఎకరాల 26 కుంటల భూమిలో కొంత భాగాన్ని, మధిర ఎస్సీకాలనీ నుంచి మార్కెట్‌యార్డు వరకు గల డొంకను, మధిర చెరువు అలుగు, పక్కన గల డొంకను, మరికొన్ని ప్రాంతాల్లో కొంతమంది ఆక్రమణాలకు పాల్పడుతున్నారన్నారు. అట్టి ఆక్రమణలను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మధిర పట్టణ సహాయ కార్యదర్శి మంగళగిరి రామానుజం, ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి చెరుకూరి వెంకటేశ్వరరావు, సిరివేరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

మధిర, జనవరి 6: లారీ డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ట్రాన్స్‌పోర్ట్ కార్యదర్శి జిల్లా ఉపేందర్, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు శీలం నర్సింహారావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మార్కెట్‌రోడ్డు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఉపేందర్, శీలం నర్సింహారావు మాట్లాడుతూ లారీడ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, రోజువారి వేతనం రూ.800 ఇవ్వాలని, కమీషన్ నూటికి ఆరు రూపాయలు చొప్పున ఇవ్వాలని, రోజువారి బేటా వంద రూపాయలు ఇవ్వాలని, టిప్పు మాములు రూ.200 ఇవ్వాలన్నారు. లారీ ఓనర్స్ తమ వద్ద పనిచేసే డ్రైవర్లను మానవతా ధృక్పథంతో ఆలోచించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్, పడకంటి మురళీ, లారీ డ్రైవర్ల అధ్యక్ష, కార్యదర్శులు, లారీడ్రైవర్లు పాల్గొన్నారు.

'పతంగులను విద్యుత్ లైన్లకు దూరంగా ఎగరవేయాలి'

మామిళ్లగూడెం, జనవరి 6: సంక్రాంతి సందర్భంగా పిల్లలు, పెద్దలు ఎగరవేస్తున్న పతంగులను విద్యుత్ లైన్లకు దూరంగా ఎగరవేయాలని న్‌పీడీసీఎల్ ఎస్ఈ సురేందర్ సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. సురక్షిత ప్రాంతాలను ఎంచుకుని పతంగులను ఎగరవేయడం శ్రేయస్కరమని అన్నారు. విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పతంగులను ఎగురవేయడం వల్ల పతంగుల మాంజాలు విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లపై పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. దారాలతో ఉన్న పతంగులు మాత్రమే ఎగురవేయాలని, చైనా మాంజాలతో పంతంగులు ఎగరవేయవద్దని సూచించారు. పతంగులు విద్యుత్ తీగల మీద, విద్యుత్ వస్తువుల మీద పడినప్పుడు వాటిని వదిలేయాలని సూచించారు. ప్రహరీ లేని డాబాలపై పతంగులు ఎరవేయవద్దన్నారు. ఏదైనా అత్యవసర సమయంలో 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సహాయం పొందాలని వివరించారు.

'వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి'

మామిళ్లగూడెం, జనవరి 6: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి తమ వేదిక పనిచేస్తుందని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్‌పర్సన్ వేణుగోపాలచారి తెలిపారు. ఖమ్మం మమత రోడ్డులోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజలు విన్నవించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సాంకేతిక సభ్యులు కే.రమేశ్, ఫైనాన్స్ సభ్యులు ఆర్.చరణ్‌దాస్, సీజీఆర్ఎఫ్ఐ మందనపు రామారావు, ఖమ్మం సర్కిల్ ఎస్ఈ సురేందర్, డీఈఈ రామారావు, ఏడీఈలు, ఏఈఈలు తదితరులు పాల్గొన్నారు.

'ప్రియదర్శిని'లో ప్రాంగణ నియామకాలు

ఖమ్మం రూరల్, జనవరి 6: మండలంలోని ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో 'డ్రీందేవ్ టెక్నాలజీస్ హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రాంగణ నియామకాలు జరిగాయి. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ శ్రీభవాని మాట్లాడుతూ సైబర్ భద్రతను పెంపొందించడం, ఇప్పటికే ఉన్న సిస్టంలో ఉన్న వాటిని ఏకీకృతం చేయడంలో తమ సంస్థకు మంచి ట్రాక్ రికార్డు ఉందన్నారు. ఎంపిక ప్రక్రియలో తొలి రౌండ్‌లో 51మంది ఎంపిక కాగా, రెండో రౌండ్‌లో 24మంది, ఫైనల్‌గా 9మందిని ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కాట్రెపల్లి నవీన్‌బాబు, డైరక్టర్లు బీ గోపాల్, ఏ వెంకటరమణ, వివిధ విభాగాల అధిపతులు విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో ఈర్లపూడి చిన్నారుల ప్రతిభ

యోగా పోటీల్లో ప్రతిభ చాటిన చిన్నారులు

రఘునాథపాలెం, జనవరి 6: తెలంగాణ యోగా ప్రచార సమితి ఆధ్వర్యంలో తనికెళ్లలో నిర్వహించిన యోగా పోటీల్లో రఘునాథపాలెం మండలం ఈర్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. పాఠశాల నుంచి 11 మంది చిన్నారులు, శ్రీఆదిత్య గాయత్రి స్కూల్ నుంచి 28 చిన్నారులు ఈ పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. వీరిని యోగా ఇన్‌స్ట్రక్టర్ కే.పావని ప్రసన్న, నాగేంద్రబాబు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

అవగాహనతోనే ప్రమాదాల నివారణ

రఘునాథపాలెం, జనవరి 6: రోడ్డు భద్రతపై అవగాహనతోనే వాహన ప్రమాదాలను నివారించవచ్చునని ఖమ్మం ప్రాంతీయ రవాణాశాఖ అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.స్వర్ణలత పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఖమ్మం నగరంలోని అటో అడ్డాల వద్ద ఆటో డ్రైవర్లకు సోమవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ ఆటోలను నడపాలని సూచించారు. నూతన ఏఎంవీఐలు గోపీ కృష్ణ, సుమలత, కానిస్టేబుళ్లు రమేశ్, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

రైతు భరోసా ఎకరానికి రూ.15వేలు ఇవ్వాలి

తిరుమలాయపాలెం, జనవరి 6: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు మండలంలోని తిప్పారెడ్డిగూడెంలో సీపీఐ(ఎంఎల్ న్యూడెమోక్రసీ) ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఎకరానికి రూ.15వేలు ఇవ్వాలని, రైతులందరికీ రూ.2లక్షలు రుణమాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గొర్రెపాటి రమేశ్, అచ్చా ఉప్పలయ్య, వీరస్వామి, బ్రహ్మచారి, పేరం వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ క్లాస్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

సత్తుపల్లిటౌన్, జనవరి 6: పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రీప్రైమరీ క్లాస్‌ను ఎమ్మెల్యే మట్టా రాగమయి సోమవారం ప్రారంభించారు. చిన్నారులకు పలక మీద ఏబీసీడీలు రాయించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. యూపీఎస్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనందరావు, మున్సిపల్